## క్లుప్తంగా

### రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మురళీనగర్: మద్రిపాలెం సెక్షన్ పరిధి గ్రీన్ గార్డెన్స్ 11కేవీ ఫీడర్‌కు నిర్వహణ పనులు కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఈఈ బీకే నాయుడు తెలిపారు. ఈ మేరకు పార్వతీనగర్, హుస్సేన్‌నగర్, పంజాబ్ హోటల్ కూడలి, గ్రీన్ గార్డెన్స్, సాయినగర్ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

### వెలగని వీధి దీపాలు



తాటిచెట్లపాలెం రేమా బ్లెస్సింగ్ చర్చ్ వద్ద అంధకారం

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం జాతీయ రహదారి సమీపంలోని రేమా బ్లెస్సింగ్ చర్చ్ వద్ద వీధి దీపాలు చాలా కాలం నుంచి వెలగడం లేదు. దీంతో అంధకారంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై అధికారులకు తెలియజేసినా ఇప్పటివరకు పట్టించుకోలేదని స్థానికులు తెలిపారు. ఈ ప్రాంతంలో చీకట్లు అలుముకోవడంతో ఏఎస్సార్ నగర్‌కు వెళ్లే వారు బిక్కుబిక్కుమంటూ తమ ఇళ్లకు చేరుకుంటున్నట్లు తెలిపారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి వీధి దీపాలు వెలిగేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

### సీసీ కెమెరాలకు మరమ్మతులు



సీసీ కెమెరాలకు మరమ్మతులు చేస్తున్న టెక్నీషియన్స్

సీతమ్మధార: నగరంలోని ప్రధాన జంక్షన్లలో సీసీ కెమెరాలకు మరమ్మతులు చేశారు. పలు ప్రాంతాల్లో మూడు రోజులుగా గాలి, వర్షానికి సీసీ కెమెరాలు పాడవడంతో జీవీఎంసీ టెక్నీషియన్స్ కెమెరాలను పూర్తి స్థాయిలో మరమ్మతులు చేశారు. సత్యం జంక్షన్‌లో నాలుగు సిగ్నల్స్‌కు ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించారు. హైవే పై పనిచేయని వాటిని సరిచేశారు.

### సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి

కంచరపాలెం: స్థానిక కంచరపాలెం ఊర్వశి జంక్షన్ కూడలి రవీంద్రనగర్‌లోని సుబ్రహ్మణ్యస్వామి ఏకాంత ఆలయంలో శ్రావణ మాస శుద్ధ త్రయోదశి మంగళవారాన్ని పురస్కరించుకుని శరవణ ట్రస్ట్ చైర్మన్, ఆలయ ధర్మకర్త దేవాల రాజు ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్యస్వామికి స్కంద పూజలు నిర్వహించారు. అష్టోత్తర శత కలశాభిషేకం, సహస్రనామం, విభూది, పుష్పాలతో అర్చనలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

### నవంబర్ 5న ఆశ్రా జాతీయ సదస్సు

బీచ్ రోడ్డు: ఢిల్లీలో ఆశ్రా 5వ జాతీయ సదస్సు నవంబర్ 18న నిర్వహించనున్నట్లు ఆశ్రా ఫౌండర్ హబీబ్ సుల్తాన్ ఆలీ తెలిపారు. ఈ మేరకు సదస్సు వాల్‌పోస్టర్‌ను మంగళవారం సిరిపురంలోని వినియోగదారుల కమిషన్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క వినియోగదారునికి తమ హక్కులపై అవగాహన కలిగించి, మోసాల నుంచి బయట పడే అవకాశాన్ని ఆశ్రా కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ్రా ప్రతినిధులు తనూజ రెడ్డి, వెంకటేశ్వరి, కె.రమణబాబు, విజయ దుర్గ, వీరుమామ పాల్గొన్నారు.



# రహదారులు మెరుగు.. అభివృద్ధి పరుగు



ఐటీఐ జంక్షన్ బీటీ రహదారిలో ఏర్పాటు చేసిన జీబ్రా క్రాసింగ్‌లు, డివైడర్లు

- పలు ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం
- స్మార్ట్ వార్డులే లక్ష్యంగా పనులు

కంచరపాలెం: బీఆర్‌టీఎస్ కంచరపాలెం రహదారి నుంచి ఏఎన్‌డీ అటు జ్ఞానాపురం వరకు బీటీ రహదారులు సుందరీకరణకు నోచుకుంటున్నాయి. జోన్–5 పరిధిలో ఇంజినీరింగ్ విభాగం అధికారులు పర్యవేక్షణలో నాణ్యమైన రహదారుల నిర్మాణ పనులు జోరుగా జరుగుతున్నాయి. కంచరపాలెం, తాటిచెట్లపాలెం, ఊర్వశి కూడలి, ఐటీఐ కూడలి, 104 ఏరియా, మద్రిపాలెం, కరాసా, జ్ఞానాపురం ప్రాంతాల్లో రహదారులు మెరుగుపరుస్తున్నారు. టీడీపీ ప్రభుత్వంలో జరగని అభివృద్ధి ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరుగుతుండడంతో వాహనాదారులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బీఆర్‌టీఎస్ రహదారుల్లో రోడ్లు గుంతలు పడడం, ట్రాఫిక్ సమస్యలు ఎదురవడంతో అనేక ప్రమాదాలు చోటు చేసుకునేవి. రోడ్డు ప్రమాదాల్లో అనేకమంది ప్రాణాలూ కోల్పోయారు. ప్రస్తుతం అభివృద్ధి పనులతో ఎలాంటి ప్రమాదాలకు తావులేకుండా అన్ని చర్యలు చేపడుతున్నారు. సుమారు రూ.2.90 కోట్ల వ్యయంతో బీటీ రోడ్లు ఫుట్‌పాత్‌లు, డివైడర్లు, ట్రాఫిక్ సిగ్నల్స్, బారికెడ్లు, తదితర అభివృద్ధి పనులు జరిగాయి. జోన్–5 జోనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, ఇంజినీరింగ్ ఈఈలు ప్రసన్నరెడ్డి, శ్రీనివాసరావులు, కంచరపాలెం ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మళ్ల అప్పారావు నేతృత్వంలో సమస్యలను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లారు. రహదారుల అభివృద్ధికి రూ.3 కోట్లు మంజూరు కావడంతో అభివృద్ధికి శ్రీకారం చుట్టారు.



కంచరపాలెంలో బీటీ రహదారి పనులను పర్యవేక్షిస్తున్న ఈఈ ప్రసన్న రెడ్డి

#### చురుగ్గా నిర్మాణ పనులు

జ్ఞానాపురం నుంచి ఎన్ఏడీ కొత్తరోడ్డు వరకు బీఆర్‌టీఎస్ రహదారుల్లో తారురోడ్డు (బీటీ) రోడ్ల నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. బీటీ రోడ్ల నిర్మాణం జరిగిన చోట ట్రాఫిక్ సిగ్నల్స్, జీబ్రా క్రాసింగ్‌లు, స్పీడ్ బ్రేకర్లు, డిజిటల్ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తున్నారు. పలు జంక్షన్ల వద్ద బారికెడ్లు, కారిడార్లకు, ఫుట్‌పాత్‌లను రంగులతో సుందరంగా ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే సుమారు రూ 1.20 కోట్లతో నిర్మించిన పనులు పూర్తికాగా మరో రూ 2.90 కోట్ల పనులు నిర్మాణ దశలో ఉన్నాయి. బీఆర్‌టీఎస్ రహదారుల్లో సమస్యల పరిష్కారం కావడం, అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతుండడంతో వాహనాదారులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

#### శరవేగంగా అభివృద్ధి



మౌలిక వసతులు అభివృద్ధి జాడ ఏనాడు కనిపించలేదు. నాలుగేళ్ల క్రితం దివంగత సీఎం డాక్టర్ రాజశేఖరరెడ్డి తనయుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని నమ్మి ఓటేశాం. మా నమ్మకాన్ని ఆయన నిలబెట్టారు. వార్డులన్నీ అభివృద్ధి చేస్తున్నారు. నిధులు పుష్కలంగా మంజూరు కావడంతో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి.

–బి.శేషు, కంచరపాలెం

#### ప్రమాదాలు జరగకుండా చర్యలు



బీఆర్‌టీఎస్ రహదారుల్లో జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు బీటీ రోడ్లు వేయడంతో ట్రాఫిక్ నియంత్రణకు మరింత సులభతరంగా మారింది. దీంతో జీబ్రా క్రాసింగ్‌లు, స్పీడ్ బ్రేకర్లు, ట్రాఫిక్ సిగ్నల్స్, డివైడర్లకు రంగులు వేయించాం. రహదారుల్లో ప్రమాదాలు జరగకుండా అన్ని చర్యలు పట్టాం. ట్రాఫిక్ నియమాలను పాటించి ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలి.

–మళ్ల అప్పారావు సర్కిల్ ఇన్‌స్పెక్టర్, కంచరపాలెం ట్రాఫిక్ పీఎస్

#### స్మార్ట్ వార్డులుగా..



జోన్–5లో వార్డులను స్మార్ట్‌గా తీర్చిదిద్దడమే ధ్యేయం. ముందుగా రహదారులను అభివృద్ధి చేస్తున్నాం. ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం, జీవీఎంసీ, ఎంపీ నిధులు మంజూరు కావడంతో వార్డును అభివృద్ధి శరవేగంగా జరుగుతోంది.

–ఆర్‌జీవీ కృష్ణ, జోనల్ కమిషనర్ జోన్–5

## చంద్రబాబు నిజస్వరూపం ప్రజలకు తెలిసింది

**రాష్ట్ర క్రిస్టియన్ కార్పొరేషన్ చైర్మన్ జాన్‌వెస్లీ**



సీతంపేట: చంద్రబాబు నాయుడు అరెస్టు ప్రభుత్వ కక్ష సాధింపు చర్య కాదని రాష్ట్ర క్రిస్టియన్ కార్పొరేషన్ చైర్మన్ జాన్‌వెస్లీ అన్నారు. అక్కయ్యపాలెం లలితానగర్‌లోని ఆయన నివాసంలో మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. సత్యమేవ జయతే అని మన భారత రాజ్యాంగం నిరూపించిందన్నారు. చంద్రబాబు చేసిన ఆకృత్యాలను బయటపెట్టిన ప్రభుత్వంపై బురద జల్లాలని ప్రయత్నిస్తే ప్రజలు విశ్వసించే స్థితిలో లేరన్నారు. రాష్ట్రంలో 14 ఏళ్లు సీఎంగా పనిచేసిన చంద్రబాబు 14 రోజులు జైలుకు వెళ్లడం సిగ్గుచేటు అని విమర్శించారు. స్వర్గీయ ఎన్టీఆర్ తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం పెట్టిన టీడీపీని భ్రష్టు పట్టించిన ఘనత చంద్రబాబుదే అని దుయ్యబట్టారు. చంద్రబాబు నిజ స్వరూపం ప్రజలకు తెలిసిందన్నారు. కోర్టు ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా టీడీపీ బంద్‌కు పిలుపు ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. టీడీపీ శ్రేణులకు రాజ్యాంగం, చట్టాలపై నమ్మకం లేదని ఎద్దేవా చేశారు. కొన్ని ప్రతిపక్ష పార్టీలు కూడా చంద్రబాబుకు వత్తాసు పలుకుతూ ప్రకటనలు చేస్తున్నాయని, దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ గతంలో చంద్రబాబు అవినీతిపరుడని విమర్శించి ఇపుడు ఆయనకు కొమ్ముకాస్తున్న తీరు ఆశ్చర్యంగా ఉందన్నారు. లోకేష్ ఉత్తర కుమారుడు మాదిరిగా ప్రగల్భాలు పలుకుతున్నాడని, చంద్రబాబు వ్యవస్థలను మేనేజ్ చేసి 21 కేసులలో స్టేలు తెచ్చుకున్నారని విమర్శించారు. బినామీ కంపెనీలతో ఒప్పందం ద్వారా స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం వెలుగులోకి వచ్చిందని గుర్తు చేశారు. క్రైస్తవ యువతకు టీడీపీ హయాంలో తీరని అన్యాయం చేశారన్నారు. చంద్రబాబుపై చంద్రబాబు అరెస్టు గురించి ఎల్లో మీడియా గగ్గోలు పెట్టినా ప్రజలు నమ్మడం లేదని, టీడీపీ బంద్ కూడా విఫలం అయిందన్నారు. ప్రజలు రోడ్డెక్కి రావాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెంనాయుడు బతిమలాడుతున్న ఆడియో లీకు అయ్యిందని, ఇది పార్టీ పరిస్థితి అద్దం పడుతోందన్నారు.

## నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చెయ్యాలి

సీతంపేట: స్థానిక సీతంపేట కూడలిలో కొలువైన దుర్గాగణపతి ఆలయంలో ఈ నెల 18 నుంచి 26వ తేదీ వరకు జరగనున్న వినాయక నవరాత్రి మహోత్సవాలను విజయవంతం చెయ్యాలని 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ అన్నారు. ఉత్సవ ఏర్పాట్లపై మంగళవారం సాయంత్రం ఆలయం వద్ద కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. వినాయక చవితి రోజు దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా క్యూలైన్లు, బారికేడ్లు ఏర్పాట్లు చెయ్యాలన్నారు. అలాగే ఏటా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నవరాత్రి ఉత్సవాలు ఈసారి కూడా ఘనంగా నిర్వహించాలని ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. కమిటీ సభ్యులంతా సమన్వయంతో ఉత్సవాలు విజయవంతమయ్యేలా కృషి చెయ్యాలన్నారు. విద్యుత్ దీపాలంకరణ, ఆలయ డెకరేషన్, స్టేజి ప్రోగ్రామ్స్, ప్రతి రోజూ ఉదయం హోమాలు, సహస్రనామార్చాన, అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, ప్రసాదాల నివేదన, ఊరేగింపు ఏర్పాట్లు, అన్నదాన కార్యక్రమం తదితర ఏర్పాట్లపై కమిటీ సభ్యులతో చర్చించారు.



కమిటీ సభ్యులతో ఏర్పాట్లపై చర్చిస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

## సీఎం జగన్ పేదల పక్షపాతి

**గడపగడపకు మన ప్రభుత్వంలో కేకే రాజు**

మురళీనగర్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల పక్షపాతి అని విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్ క్యాప్ చైర్మన్ కేకే రాజు అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 49వ వార్డు మురళీనగర్– 3 సచివాలయం 1086279 పరిధిలోని మురళీనగర్ సెక్టార్–3,4,8 ప్రాంతాల్లో 49వార్డు కార్పొరేటర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకర రావుతో కలిసి మంగళవారం సాయంత్రం ఆయన పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ఇప్పటివరకు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ ఫలాలను వివరించారు. ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేకే రాజు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన పాదయాత్రలో ప్రజల ఆర్థిక ఇబ్బందులను నేరుగా తెలుసుకున్నారని దానికి అనుగుణంగా నేడు విద్య, వైద్యం, ఉపాధి ప్రతి పేదకుటుంబానికి అందేవిధంగా పరిపాలన కొనసాగిస్తున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ జగనే సీఎం అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రొంగలి జగన్నాథం, యాత కార్పొరేషన్ చైర్మన్ పిల్లి సుజాత, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్ రాజు, జేసీఎస్ ఇన్‌చార్జి నీలిరవి, అమర్ రెడ్డి, భట్రాజుల కార్పొరేషన్ డైరెక్టర్ యస్.రవికుమార్, 49 వార్డు నాయకులు ఢిల్లీ రావు, ఎస్ చంద్రశేఖర్, ఆదిరెడ్డి శ్రీను, శకుంతల, బి.సరస్వతి, మంగ, ప్రశాంతి, ఎస్ శ్రీను, మున్నా, శివరాంప్రసాద్, శంకర్, రమేష్, చైతన్య, షేక్ బాబ్జి, కె.చిన్నా, జి. ప్రసాద్, జీవీఎంసీ అధికారులు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు ఆర్పీలు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల కరపత్రాలను అందిస్తున్న కేకే రాజు, అల్లు శంకరరావు

## 16న లలితాపీఠంలో అష్టావధానం

సీతంపేట: లలితానగర్ శ్రీలలితాపీఠంలో ఈ నెల 16, 17 తేదీల్లో కవితా మహేంద్రజాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేస్ తెలిపారు. 16వ తేదీ సాయంత్రం 6 గంటలకు అష్టావధానం జరుగుతుందని డాక్టర్ కడిమిళ్ల వరప్రసాద్ సంచాలకులుగా, శతావధాని బులుసు అపర్ణ, పలువురు సాహితీవేత్తలు పాల్గొంటారని తెలిపారు. 17వ తేదీ సాయంత్రం 6 గంటలకు తెలుగు విజయం సాహితీ రూపకం ప్రదర్శించబడుతుందన్నారు. ఇందులో పాత్రధారులు నన్నయగా కడిమిళ్ల వరప్రసాద్, పురాణకవిగా గొర్తి సుబ్రహ్మణ్యశాస్త్రి, ప్రబంధకవిగా అబ్బిరెడ్డి పేరయ్యానాయుడు, శతకకవి పి.రామచంద్రరావు, అవధాన కవి బులుసు అపర్ణ, నాటక కవి సి.వి.వి.సత్యనారాయణమూర్తి పాల్గొంటారని తెలిపారు. రెండు రోజులు సాహిత్య కార్యక్రమాలూ పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి సమక్షంలో జరుగుతాయన్నారు.

## దోమల నియంత్రణకు పటిష్ట చర్యలు

సీతంపేట: వర్షాకాలంలో విజృంభించే డెంగ్యూ ,మలేరియా జ్వరాలను వ్యాప్తి చేసే దోమల నియంత్రణకు జీవీఎంసీ జోన్ 3 యంత్రాంగం పటిష్ట చర్యలు చేపడుతోంది. వారంలో ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే పేరిట జీవీఎంసీ మలేరియా సిబ్బంది, సచివాలయ హెల్త్ సెక్రటరీలు, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి నీటి నిల్వలను పరిశీలించి దోమలు పెరుగుదలను గుర్తించి లార్వా దశలోనే దోమలను నాశనం చేస్తున్నారు. అలాగే మహిళలకు, డ్వాక్రా సంఘాల సభ్యులకు, ఆర్పీలకు దోమలు పెరిగే ప్రదేశాలు, దోమల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి మంగళవారం ఇంటింటికీ వెళ్లి ఓవర్ హెడ్‌ట్యాంకులను తనిఖీ చేస్తున్నారు. ట్యాంకులకు మూతలు ఉన్నాయా లేదా, ట్యాంకుల్లోని నీట్లో దోమల లార్వాలు పెరుగుతున్నాయా గమనిస్తున్నారు. ట్యాంకుల్లో లార్వా ఉన్నట్టయితే టిమోఫాస్ మందు కలుపుతున్నారు. జీవీఎంసీ మలేరియా సిబ్బంది మంగళవారం ఉదయం 26, 27 వార్డుల్లో ఓవర్ హెడ్ తనిఖీలు చేశారు. సాయంత్రం 27వవార్డులోని పలు ప్రాంతాలలో మెగా ఫాగింగ్ చేపట్టారు. ఈ కార్యక్రమంలో మలేరియా ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ కె.ఎస్.ఎస్.నారాయణ, హెల్త్ అసిస్టెంట్ శివ పర్యవేక్షించారు.



అక్కయ్యపాలెంలో ఓవర్ హెడ్ ట్యాంకుల్లో దోమల మందు కలుపుతున్న సిబ్బంది

## ఎన్‌ఎంయూఏకు గుర్తింపు జీవో



నాగమణి నుంచి గుర్తింపు యూనియన్ జీవోను తీసుకుంటున్న ఎన్‌ఎంయూఏ నాయకులు

మద్దిలపాలెం: నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్‌కు ప్రభుత్వం గుర్తింపు జీవో జారీ చేసిందని అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు జీవోను మంగళవారం సచివాయలంలో జీఏడీ డిప్యూటీ సెక్రటరీ నాగమణి నుంచి స్వీకరించినట్టు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజేష్‌కుమార్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## సినీనటుల సందడి



నటుడు శత్రు, ప్రతిక్ష మిశ్రా

కొమ్మాది: ఆరిలోవలో మంగళవారం సినీనటులు సందడి చేశారు. ఇక్కడున్న ఓ ఆస్పత్రిలో జరిగిన సినిమా షూటింగ్‌లో నటి ప్రతిక్ష మిశ్రా, నటుడు శత్రు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శత్రు మాట్లాడుతూ తన సినీ కెరీర్‌లో రంగస్థలం, పుష్ప మంచి గుర్తింపునిచ్చాయన్నారు. ప్రస్తుతం ఓ సినిమాలో (పేరు ఖరారు కాలేదు) రెండో హీరోగా నటిస్తున్నట్లు ఆయన తెలిపారు. సినీనటులు రాకతో ఆస్పత్రి వాతావరణం అంతా సందడిగా మారింది.

## కత్తితో కోడలిపై మామ దాడి

**అదనపు కట్నం కోసం వేధింపులు**

బీచ్‌రోడ్డు : కోడలిపై మామ దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం బుల్లయ్య కాలేజీ సమీపంలో నివాసముంటున్న బొట్టా అప్పారావు.. తన కుమారుడు మధుసూదనరావుకు పదేళ్ల క్రితం అనకాపల్లికి చెందిన హారికతో పెళ్లి చేశాడు. ఆ సమయంలో ఇచ్చిన లాంఛనాలు కాకుండా అదనంగా మరో రూ.2 లక్షల కట్నం అడగడంతో రెండు కుటుంబాల మధ్య గొడవలు మొదలయ్యాయి. ఈ విషయంలో కుమారుడు మధుసూదనరావు కూడా భార్య కుటుంబానికి సహకరించటంతో అప్పారావు తట్టుకోలేకపోయాడు.

దీంతో కొడుకు, కోడలిని ఇబ్బంది పెట్టడం ప్రారంభించారు. మూడో అంతస్తులో నివాసం ఉంటున్న తన కుమారుడు ఇంటికి నీటి సదుపాయం నిలిపివేశాడు. దీంతో కోడలు నీటి కోసం సోమవారం దిగువ ఫ్లోర్‌కు రావడంతో చూసి సహించలేని అప్పారావు కత్తితో దాడి చేశాడు. ఆమె తప్పించుకోవడంతో భుజానికి గాయమైంది. విషయం గమనించిన చుట్టు పక్కల వాళ్లు అప్పారావును అడ్డుకొన్నారు. అనంతరం హారికను కేజీహెచ్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గాయపడిన హారిక

## రేపటి నుంచి ‘విస్టా’ వర్క్‌షాపు

అగనంపూడి: ఇంజినీర్స్ డే సందర్భంగా ఈ నెల 14వ తేదీ నుంచి రెండు రోజుల పాటు దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ సాంకేతిక సదస్సును నిర్వహిస్తున్నట్లు కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ జె.సుధాకర్ తెలిపారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో సాంకేతిక సదస్సు విస్టా (విజ్ఞాన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) –2023 పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని రెండు రోజుల పాటు ‘సస్టెయినబుల్ టెక్నాలజీస్’ పై ఇంజినీరింగ్ విభాగాలకు చెందిన అంశాలను రెండు రోజుల ప్రదర్శనలో ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. దేశంలోని వివిధ యూనివర్సిటీలు, ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొని సమాజానికి హితం చేకూర్చే ప్రదర్శనలు, లైవ్ ఎగ్జిబిషన్ల నిర్వహణ, టెక్నికల్ వర్క్‌షాపులు, పోస్టర్ ప్రజంటేషన్లు, 2డీ, 3డీ ప్రింటింగ్ మోడళ్లు, కోడింగ్ వంటివి ప్రదర్శిస్తారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రవీంద్ర, కన్వీనర్ బోడే ప్రసాద్, కో–కన్వీనర్ పద్మాకర్, వివిధ విభాగాల డీన్లు, స్టూడెంట్స్ కన్వీనర్లు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విజ్ఞాన్ రెక్టార్ మధుసూదనరావు తదితరులు

## హిందీ భాషా వారోత్సవాలు

డాబాగార్డెన్స్ : విశాఖ ప్రభుత్వ డిగ్రీ, పీజీ మహిళా కళాశాలలో హిందీ దివస్‌ను పురస్కరించుకుని మంగళవారం హిందీ భాషా వారోత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శోభారాణి హిందీ భాష ఆవశ్యకత గురించి విద్యార్థినులకు వివరించారు. ఈ నెల 19 వరకు నిర్వహించే ఈ వారోత్సవాల్లో వివిధ కళాశాలలు పాల్గొంటున్నాయని తెలిపారు.

## పర్యావరణ చైతన్యానికి కృషి అవసరం

ఏయూ క్యాంపస్: విద్యార్థుల్లో పర్యావరణ చైతన్యం పెంచే దిశగా అధ్యాపకులు కృషి చేయాల్సిన అవసరం ఉందని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత అన్నారు. మంగళవారం ఏయూ హెచ్‌ఆర్‌డీసీ కేంద్రంలో నిర్వహిస్తున్న పర్యావరణ శాస్త్రంపై పునశ్చరణ తరగతులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా రెక్టార్ మాట్లాడుతూ ఇక్కడ నేర్చుకున్న నూతన జ్ఞానాన్ని విద్యార్థులకు అందించాలని సూచించారు. సృజనాత్మకత, సహనం, కమ్యూనికేషన్ స్కిల్స్, కాల నిర్వహణ, కాలానుగుణంగా మార్పులను ఆకళింపు చేసుకోవడం వంటి లక్షణాలను అధ్యాపకులు అలవాటు చేసుకోవాలన్నారు. పర్యావరణ మార్పులు పెను సవాళ్లను విసురుతున్నాయన్నారు. ఊహించని విధంగా వరదలు రావడం, ప్రత్యామ్నాయ ఇంధనాలను అన్వేషించడం ఎంతో అవసరమన్నారు. వాయు కాలుష్యం కారణంగా లక్షలాది మంది ప్రతి సంవత్సరం మృత్యువాత పడుతున్నారన్నారు. అనేక పర్యావరణ సంబంధ సమస్యలకు పరిష్కారాలను చూపే దిశగా ఆచార్యులు కృషి చేయాలన్నారు. యువతను తీర్చిదిద్దడంలో అధ్యాపకునికి సహనమే అతిపెద్ద ఆయుధంగా నిలుస్తుందన్నారు. ఏయూ హెచ్‌ఆర్‌డీసీ కేంద్రం సంచాలకుడు ఆచార్య టి.వెంకటకృష్ణ మాట్లాడుతూ విభిన్న జీవులతో సమన్వయం చేసుకుంటూ సాగడం మానవ జీవన విధానమన్నారు. వైవిధ్య అంశాలు, శాస్త్రాల సమ్మేళనంగా పర్యావరణ శాస్త్రం నిలుస్తుందన్నారు. సహజ వనరుల సంరక్షణ, జీవ వైవిధ్య పరిరక్షణ, పర్యావరణ మార్పులపై అవగాహన, విపత్తులు, వ్యర్థాల నిర్వహణపై అవగాహన పెంచుకోవాలన్నారు.

## కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

#### 27వ రోజుకి శ్రావణలక్ష్మి పూజలు

కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ పూజలు మంగళవారం 27వ రోజుకి చేరాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వరాల నడుమ ప్రారంభమైన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టు ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు చేసి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. శ్రావణ లక్ష్మీ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.400 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఈవో కె. శిరీష తెలిపారు.



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

## మాంగనీసు లీజు గడువు పెంపునకు సహకరించండి



ఎంపీ ఎంవీవీకి వినతిపత్రం అందజేస్తున్న సీ ప్రధాన కార్యదర్శి ప్రసాద్

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్‌కు ప్రస్తుతం ఉన్న గర్భాం మాంగనీసు లీజు గడువు పెంపునకు చర్యలు తీసుకోవాలని ఉక్కు అధికారుల సంఘం (సీ) అధ్యక్షులు కాటం చంద్రరావు, ప్రధాన కార్యదర్శి కె.వి.డి.ప్రసాద్ కోరారు. విశాఖ ఎంపీ ఎం.వి.వి.సత్యనారాయణను వారు కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. స్టీల్‌ప్లాంట్‌కు 40 ఏళ్ల క్రితం విజయనగరం జిల్లా గర్భాం గ్రామ పరిధిలో మాంగనీజు గనులు కేటాయించారన్నారు. దాని గడువు గత ఏడాది అక్టోబర్ 7వ తేదీతో ముగిసిందన్నారు. నిబంధనల ప్రకారం ఇంకో పది సంవత్సరాలు లీజు గడువు పెంపు కావాలని స్టీల్ ప్లాంట్ యాజమాన్యం దరఖాస్తు చేసుకుందన్నారు. దురదృష్టవశాత్తు లీజు గడువు ఫైలు మైనింగ్ మంత్రిత్వ శాఖ వద్ద పెండింగ్‌లో ఉందన్నారు. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వం పెద్దలతో మాట్లాడి లీజు గడువు పెంపునకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఎంపీ స్పందించి వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రికి లేఖ పంపినందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు.